పేదల సొంతింటి కల సాకారం

- శింగనమల నియోజకవర్గంలో పెద్దఎత్తున గృహ నిర్మాణాలు
- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు పెద్దపీట
- సీఎం జగన్‌కు అండగా ఉంటామన్న లబ్ధిదారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ప్రమీల. ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఇంటి స్థలం లేక అద్దె ఇంట్లో ఉండేది. ప్రతి నెలా ఇంటి బాడుగ, కరెంట్ బిల్లు కట్టేందుకు సంపాదన సరిపోయేది కాదు. కొడుకు ఆటో నడుపుతూ వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషించుకునేది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక, వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి స్థలం, ఇల్లు మంజూరైందని చెప్పాడు. రూ.లక్షలు విలువ చేసే స్థలంతో పాటు గార్లదిన్నె రైల్వే స్టేషన్ పక్కన జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తవడంతో గృహ ప్రవేశం చేసింది. ఇక ప్రతి నెలా అద్దె కట్టే పని లేదు. వచ్చే కూలి డబ్బులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కుటుంబం పోషించుకుంటున్నానని ఆమె ఆనందపడుతోంది. స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.



గార్లదిన్నెలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



జగనన్న కాలనీకి స్వాగత ఆర్చ్ నిర్మాణం

గార్లదిన్నె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. ఇళ్లు కాదు కొత్తగా ఊళ్లనే సృష్టించేలా చర్యలు చేపట్టడంతో ఎంతో మంది పేదలు సంతోషంగా తమ గూళ్లకు చేరుకుంటున్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద శింగనమల నియోజకవర్గంలో 4,334 మంది పేదలకు గృహాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులు పెద్దఎత్తున గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకు నియోజకవర్గం వ్యాప్తంగా 2,199 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. అలాగే ప్రభుత్వం జగనన్న కాలనీల్లో విద్యుత్, నీరు తదితర మౌలిక వసతులు కల్పించింది. కాలనీలకు స్వాగత ఆర్చ్‌లు సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని లబ్ధిదారులు మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా ఉంటామన్నారు.

శింగనమల నియోజకవర్గంలో గృహ నిర్మాణాలు ఇలా ..

మండలం	గృహాల మంజూరు	నిర్మాణాలు చేపట్టనవి	పునాది లెవల్	బేస్‌మెంట్ లెవల్	రూఫ్ లెవల్	ఆర్‌సీ లెవల్	పూర్తయినవి
గార్లదిన్నె	1,000	6	24	147	37	27	726
శింగనమల	160	30	16	09	5	73	27
బుక్కరాయసముద్రం	2,390	2	65	555	162	47	1,411
నార్పల	341	143	10	27	18	135	8
పుట్లూరు	260	82	7	13	13	123	22
యల్లనూరు	183	40	5	11	16	106	5

సకాలంలో ఇంటి నిర్మాణ బిల్లులు



మండల వ్యాప్తంగా 1,000 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 726 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి స్లాబ్, రూఫ్ స్థాయిలో ఉన్నాయి. తొందరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించాం. నిర్మాణం చేపట్టిన వారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది.

– నవీన్, హౌసింగ్ ఏఈ, గార్లదిన్నె

క్లుప్తంగా

ఉలిగమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లు టౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో ఉలిగమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.50 వేల విరాళమిచ్చారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆలయ కమిటీ పెద్దలకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచండి



షికారీ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరురోడ్ షికారీ కాలనీలో ఇళ్ల మధ్యన మురుగు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని శానిటేషన్ అధికారులు, కార్యదర్శులను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన షికారీకాలనీలో పర్యటించి పారిశుధ్యం మెరుగుపరిచేందుకు స్పెషల్‌డ్రైవ్ ఏర్పాటు చేయించాలన్నారు. కాలనీలో డిస్పోజల్ డ్రైనేజీ నిర్మించే వరకూ రెగ్యులర్‌గా పారిశుధ్య పనులు చేయించాలన్నారు. అనంతరం పాత కంపోస్టుయార్డును పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్బన్ సీఐగా మురళీకృష్ణ



తాడిపత్రి అర్బన్: తాడిపత్రి అర్బన్ సీఐగా ఎస్.మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. రెండు నెలలుగా సీఐ పోస్టు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా మదనపల్లెలో సీఐగా పనిచేస్తున్న ఎస్.మురళీకృష్ణను పోలీసు ఉన్నతాధికారులు తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో ఆయన శనివారం సాయంత్రం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ సీఎం గంగయ్యను సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

మాఘమాస పూజలు ప్రారంభం



అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు: మండలంలో శనివారం మాఘమాస ప్రత్యేక పూజలు ఘనంగా ప్రారంభించారు. మహిళలు, చిన్నారులు మాఘ స్నానాలు ఆచరించి స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం, పేట శివాలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ఆటో నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో శనివారం ఆటోలో నుంచి జారి కింద పడి శ్రీరాములు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్‌ఎస్‌లోని తొళ్లషాపు కాలనీకి చెందిన ఆయన ఆటోలో గుత్తికి వెళ్లాడు. తిరిగి ఆటోలో ఆర్‌ఎస్‌కు వెళ్తుండగా జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆయనను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు



గాయపడిన ఈశ్వర్, బీమా

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో మోడల్ స్కూల్ వద్ద శనివారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో యువకులు ఈశ్వర్, బీమా తీవ్రంగా గాయపడ్డాడు. గుత్తిలోని బెస్త కాలనీకి చెందిన వారె బాట సుంకులమ్మ దేవాలయానికి వెళ్లారు. తిరిగి గుత్తికి వెళ్తుండగా మోడల్ స్కూల్ వద్ద బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ సంపత్‌కుమార్

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం క్రాస్ వద్ద శనివారం ఏఎస్ఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు లేని వాహనాలు, పరిమితికి మించి లోడుతో వెళ్తున్న ఆటోలు, జీపులకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జనార్దన్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

గుంతకల్లు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు జీఎంవీ చలపతి తెలిపారు. ఆదివారం అసోయేషన్ కార్యాలయంలో జరిగన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఈఓ రాముడు, పీ రామారావు, కోశాధికారిగా పీ దాదాఖాన్, ఉపాధ్యక్షుడిగా జీ భీమన్న, అసోషియేట్ అధ్యక్షుడిగా ఎం.చంద్రకళావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గంగరాజు, సహాయ కార్యదర్శిగా ఆర్.విశ్వనాథ్ ఎన్నికయ్యారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

యాత్ర–2 మూవీ సూపర్



సినిమా చూస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: యాత్ర–2 సినిమా చాలా బాగుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. శనివారం అనంతపురంలోని ఒక థియేటర్‌లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి వారు యాత్ర–2 మూవీ వీక్షించారు. అనంతరం థియేటర్ బయట విలేకరులతో మాట్లాడారు. యాత్ర–2 మూవీని దర్శకుడు మహి వి రాఘవ కళ్లకు కట్టినట్లు తెరక్కించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాంతరం ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబం పడిన కష్టాలు, వాటిని ఎదుర్కొని రాజకీయంగా నిలబడడాన్ని అభిమానులు మెచ్చేలా తెరక్కించారన్నారు. వైఎస్ జగనన్న పాత్రలో నటుడు జీవా ఒదిగిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఆలూరు సాంబశివారెడ్డి, ఎం.వీరాంజనేయులు

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో నిరంజన గురురంగస్వామి ఆరాధన మహోత్సవ శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు హాజరై ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. గ్రామస్తులు ఏటా ఐకమత్యంతో నిరంజన గురురంగస్వామి ఆరాధన ఉత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాఘవరెడ్డి, సీనియర్ న్యాయవాది నామాల భాస్కర్‌రెడ్డి, నాయకులు తిమ్మాపురం సూర్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి ప్రముఖుల హాజరు

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి గ్రామానికి చెందిన జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి నూతన గృహ ప్రారంభోత్సవానికి శనివారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న డీఎం నారాయణస్వామి

గుంతకల్లుటౌన్: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని ఆర్టీసీ డిపో మేనేజర్ నారాయణస్వామి సూచించారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవాహన కల్పించేందుకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ మితిమీరిన వేగం ప్రాణానికే ప్రమాదమన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, భారీ వాహనాలు నడిపేవారు సీటుబెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతర ప్రాణాలను హరించొద్దన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇచ్చి రోడ్లపైకి పంపొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పర్యాటక హబ్‌గా మూడు ప్రాంతాలు



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: గుత్తి కోట, సేవాగఢ్, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నల్లమేకలపల్లి వద్ద ఉన్న వాల్మీకి కేవ్స్‌లను ప్రభుత్వం త్వరలోనే పర్యాటక హబ్‌గా చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సేవాగఢ్‌లో ఐటీ వింగ్ ప్రతినిధులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడు ప్రాంతాలను కలుపుతూ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యాటక హబ్ చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అధికారులతో మాట్లాడారన్నారు. ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు సేవాగఢ్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. గుత్తికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాల్మీకి కేవ్స్‌లను ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి చేసిందన్నారు. మూడు ప్రాంతాలను కలుపుతూ ప్రభుత్వం బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. సెలవు రోజుల్లో గుత్తి కోట, సేవాగఢ్, వాల్మీకి కేవ్స్‌లను పర్యాటకులు సందర్శించేలా ప్రభుత్వం తరఫున పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు జ్ఞానేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీరావు, సలహాదారుడు గురుశంకర్ పాల్గొన్నారు.

కళా సేవకునికి సన్మానం

పామిడి: పట్టణ స్వరరాగ నాటక కళాసమితిలో ఆ సమితి వ్యవస్థాపకుడు, కళా సేవకుడు ఎం.దేవరాజ్‌ను శనివారం పామిడి సీనియర్ కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల విజయవాడలో పద్మశ్రీ బుర్రకథ పితామహుడు నాజర్ జయంత్సోవాలకు ఆయనను ఆహ్వానించి సన్మానించారు. ఇందుకు స్థాని నాటకరంగ కళాకారులు ఆయనను సత్కరించారు. కళాకారులు పీ కృష్ణారావుయాదవ్, పీసీ రత్నరాజు, నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఐ పర్యటన

బుక్కరాయసముద్రం: రేగడి కొత్తూరు, భద్రంపల్లి, కొట్టాలపల్లి, బీకేఎస్‌లో సీఐ వెంకటేశ్వర్లు శనివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు సఖ్యతగా మెలగాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు, అక్రమంగా మద్యం, గుట్కా సరఫరా జరిగినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన రెడ్డి

యాడికి: పేదల పక్షపాతి సీఎం జగన్ అని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీ, పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి పేదల సంక్షేమం కోసం ఇలాంటి పథకాలు అమలు చేయలేదన్నారు. పేదల బతుకులు మారాలంటే మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, రాగుల వెంకట రామిరెడ్డి, శివకేశవ రెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరుతున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: రాష్ట్రాన్ని సంక్షేమ పథంలోకి నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన 35వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలోల పలు సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇలాంటి నాయకుణ్ణి మళ్లీ సీఎంగా చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనోజ్, నాయకులు నాగభూషణం,బాలరాజు, అలీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు సన్మానం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శివమాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్న దాతలను శనివారం ధర్మకర్త కే నారాయణమూర్తి ఘనంగా సన్మాంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శివమాల ధారులకు అన్నదానం చేయడం పత్రా రాజమ్మ పుల్లయ్య దంపతుల పూర్వజన్మ సుకృతమన్నారు.

13న సేవాగడ్‌లో ఉచిత వైద్య శిబిరం

గుత్తి రూరల్: మండలంలోని సేవాగడ్‌లో ఈ నెల 13న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నారాయణ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నారాయణ నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే వైద్య శిబిరానికి ప్రముఖ వైద్యులు రఘురాములు, శంకర్, రమణనాయక్ హాజరవుతారన్నారు. వైద్య శిబిరాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శివాలయానికి వెళ్లే దారి బంద్

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిని మూసివేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే మహా శివారాత్రి ఉత్సవాల్లో భాగంగా నెహ్రూ పార్క్ వద్ద ఆర్చ్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకల వల్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆలయానికి వెళ్ళే భక్తులు ఈ మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని కోరారు. ముఖ్యంగా ఈ దారి మీదుగా హిందూ శ్మశాన వాటికకు వెళ్లే వైకుంఠ వాహన డ్రైవర్లు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఆర్చ్ నిర్మాణం వేగవంతంగా పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలకు తరలిరండి



సేవాలాల్ ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్తి మండలంలోని సేవాగడ్‌లో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించే ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని వసతులను అధికార యంత్రాంగం ఏర్పాటు చేయిస్తోందన్నారు. సేవాలాల్‌ను దర్శించి తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ గోవింద్‌నాయక్, బంజారా సంఘం నాయకులు రమణానాయక్, తిరుపాల్‌నాయక్, సోమ్లానాయక్, నందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైవీఆర్‌కు సన్మానం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న దేవరపల్లివాసులు

పామిడి: గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మండలంలోని దేవరపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. 30 ఏళ్లుగా దేవరపల్లిలో శ్మశాన వాటికకు వెళ్లాలంటే కంపుకొడుతున్న డ్రైనేజీ కాలువ గుండా వెళ్లాల్సిన దుస్థితి. గ్రామస్తుల ఇబ్బందులను వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య తదితరులు ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణం స్పందించి స్థల సమస్యతో పాటు ఎంపీపీ గ్రాంటు కింద రూ.2 లక్షలతో శ్మశాన వాటికకు గరుసురోడ్డు వేయించిన విషయం పాఠకులకు తెలిసిందే. సమస్య పరిష్కారమవడంతో ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలమాలవేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నక్కా ఓబులేసు, నక్కా నారప్ప, శంకరయ్య, శంకర, రాజగోపాల్, శంకర్ నారాయణ, అమర్నాథ్, నల్లప్ప, నాగేశేషు, గణపతి, పరమేశ్, మల్లికార్జున, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్



స్వామి దర్శనానంతరం తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్, తమిళనాడు అడ్వకేట్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ ఎస్.ప్రభాకరన్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతపురంలోని జేఎన్‌టీయూలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఉత్తర్‌ప్రదేశ్ హైకోర్టుకు చెందిన మరో ఇద్దరు జడ్జిలతో కలిసి శనివారం సాయంత్రం కసాపురం దేవస్థానానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అశ్వత్థంలోకి వాహనాలకు నో ఎంట్రీ

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి స్వామి క్షేత్రంలోకి ఆదివారం తిరునాల సందర్భంగా వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు యాడికి సీఐ రోషన్ తెలిపారు. క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తమ వాహనాలను నిర్దేశిత స్థలాల్లో పార్కింగ్ చేయాలన్నారు. 108, 104 వాహనాలు మినహా ఏ వాహనాన్నీ క్షేత్రంలోకి అనుమతించబోమని, భక్తులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. నీరు విడుదల చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోకి ఎవ్వరూ వెళ్లకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శరత్‌చంద్ర వెల్లడించారు.